క్లుప్తంగా

సబ్ రిజిస్ట్రార్‌గా సునంద



సబ్‌కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న సబ్‌రిజిస్ట్రార్ సునంద

ఆదోని రూరల్: ఆదోని సబ్ రిజిస్ట్రార్‌గా సునంద బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నెలకొన్న రిజిస్ట్రేషన్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ల విషయంలో అలసత్వం వహించరాదని, అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నప్పుడే రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదోని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. బుధవారం ఆదోని పట్టణంలోని అక్షరశ్రీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, మాదక ద్రవ్యాలైన గుట్కా, గంజాయి, సిగరెట్లు, డ్రగ్స్, సారా వంటివాటి జోలికెళ్లవద్దన్నారు.

మంత్రాలయం రూరల్ : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శివాంజల్ సూచించారు. బుధవారం స్థానిక శ్రీ రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఈవ్‌టీజింగ్ ర్యాగింగ్, సైబర్ నేరాలు, మహిళల రక్షణ, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన



నిరసన తెలియజేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

ఆదోని టౌన్: పట్టణంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారానికి 30వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు పీరాసాహెబ్, సోమన్న, కర్రెప్ప, అహ్మద్, వీరేష, ఫక్రుద్దీన్, వై.రామాంజనేయులు, ఈరన్న, జేసీబీ తిమ్మప్ప, కరిముల్లా, మూకన్న, ఎం.కుమార్ తదితరులు మాట్లాడారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

ఎమ్మిగనూరుటౌన్: తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం చేస్తున్న ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో జాప్యం చేయడం తగదని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యునియన్ నాయకులు రాజేంద్ర, నారాయణలు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారానికి 57వ రోజుకు చేరుకుంది.

చేతి పంపులకు మరమ్మతులు



బోరింగుకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

కౌతాళం: గ్రామంలోని చేతి పంపులకు మరమ్మతులు చేపట్టినట్లు కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. కౌతాళం జిల్లా పరిషత్ పాఠశాలలో, ఉరుకుంద క్రాస్‌రోడ్డు శ్మశానం వద్ద చెడిపోయిన బోరింగులను ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్‌ల సహకారంతో కార్యదర్శి ప్రకాశం ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా పంచాయతీ కార్యాలయం దృష్టికి తెస్తే పరిష్కారం చూపుతామన్నారు.

బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సామేలు



ఎమ్మిగనూరుటౌన్: బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మంత్రాలయం నియోజకవర్గానికి చెందిన గుడిపి సామేలును నియమిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించినందున పార్టీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని సామేలు తెలిపారు.



చిన్నకడబూరు సమీపంలో ఇలా..



రంగాపురం గ్రామ సమీపంలో..



ఆదోని ప్రధాన రహదారి దుస్థితి

- రోడ్లపై ఎటు చూసినా గుంతలే
- ప్రయాణం చేయాలంటేనే భయం
- ఆటోలో ప్రయాణానికి జంకుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

రహ'దారుణాలు'

పెద్దకడబూరు : పెద్దకడబూరు మండల కేంద్రం నుంచి ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాలకు వెళ్లే ప్రధాన రహదారుల అధ్వానంగా తయారయ్యాయి. అడుగడుగునా పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఎక్కడ గుంత ఉందో.. ఎక్క బాగుందో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతుంటారు. ద్విచక్ర వాహనదారులైతే కింద మీద పడుతూ ప్రయాణించాల్సి వస్తోంది.

13 కిలోమీటర్లు గుంతలే..

పెద్దకడబూరు నుంచి ఆదోనికి వెళ్లాలంటే బైచిగేరి అడ్డరోడ్డు వరకు 13 కిలోమీటర్లు గుంతల్లో ప్రయాణించాల్సిందే. వర్షం పడిందంటే ఇక అంతేసంగతులు. 13 కిలోమీటర్ల వరకు రోడ్డు మడుగును తలపిస్తుంది. ఎక్కడ గుంత ఉందో.. ఎక్క బాగుందో తెలియని వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు కింద పడిన సందర్భాలూ అనేకం. ఈ రహదారిలో సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఈ రహదారిలో ఆటోలో ప్రయాణం అంటేనే భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది. రోగులు, గర్భిణులకు ఈ రహదారుల్లో ప్రయాణం అంత మంచిది కాదని డాక్టర్లు సైతం సూచిస్తున్నారు.



పెద్దకడబూరు - ఆదోని రహదారిలో మడుగును తలపిస్తున్న రోడ్డు



ఎమ్మిగనూరు - కోసిగి ప్రధాన రహదారిలో జాలవాడి సమీపంలో ఛిద్రమైన రోడ్డు

20 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ప్రయాణం

ఎమ్మిగనూరు – కోసిగి ప్రధాన రహదారిలో పెద్దకడబూరు మండల పరిధిలోని కొత్త గొల్లల దొడ్డి మారెమ్మ గుడి వద్ద నుంచి కంబలదిన్నె వరకు ఉన్న 12కిలోమీటర్లు ప్రయాణించేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు కోసిగి చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లే ఉపాధ్యాయులు, ప్రభుత్వ అధికారులే వారి వాహనాలను ఆ రోడ్డులో ప్రయాణించలేక సుమారు 20కిలోమీటర్లు ఎక్కువ అయినా మంత్రాలయం మీదుగా ప్రయాణిస్తున్నారు. అంటే ఆ రోడ్డు ఎలా ఉంటుందో మనకు అర్థం అవుతుంది. ఇంకో 20 రోజుల్లో శ్రావణ మాసం ప్రారంభం అవుతోంది. ఎమ్మిగనూరు నుంచి రోజూ వేల సంఖ్యలో ఉరుకుందకు వెళ్తారు. ఉరుకుందకు వెళ్లాలంటే ఈ రోడ్డుగుండా వెళ్లాల్సి ఉంటుంది. ప్రజలు, భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు రహదారులకు మరమ్మత్తులు చేయించాలని కోరుతున్నారు.

రోడ్లపై నరకయాతన



నుంచి జాలవాడి గ్రామానికి 12కిలో మీటర్లు ప్రయాణానికి నరకయాతన అనుభవిస్తున్నాం. రోడ్డు సరీగా లేకపోవడంతో అర గంట ప్రయాణానికి గంటపైన సమయం పడుతోంది. పలుమార్లు ద్విచక్ర వాహదారులు కిందపడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఒక్కోసారి 20కిలోమీటర్లు ఎక్కువైనా సరే పెద్దకడబూరు మీదగా వెళ్తున్నాం.

–ఉసేని, జాలవాడి గ్రామం,ఎమ్మిగనూరు

ప్రతిపాదనలు పంపాం

గతంలో రోడ్డు మరమ్మతులకు వచ్చిన అనుమతులు రద్దు అయ్యాయి. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత రెండు రోడ్డులకు ప్రతిపాదనలు పంపించాం. ఆదోని రహదారిలో బైచిగేరి నుంచి పెద్దకడబూరు వరకు ఉన్న 13కిలోమీటర్లు డబుల్ రోడ్డు కోసం రూ. 36కోట్లుతో, సింగిల్ రోడ్డు కొరకు రూ. 7.5కోట్లుతో ప్రతిపాదనలు పంపించాం. అదేవిధంగా ఎమ్మిగనూరు నుంచి కంబలదిన్నె వరకు ఉన్న 12 కిలోమీటర్లుకు డబుల్ రోడ్డు కొరకు రూ. 35కోట్లుతో, సింగిల్ రోడ్డు కొరకు రూ. 6కోట్లుతో ప్రతిపాదనలు పంపించాం. – విజయ్ నరేష్, ఏఈ, ఆర్అండ్‌బీ

చూడి నుంచి కరణికి రోడ్డు వేయండి

కౌతాళం: మండల పరిధిలోని చూడి నుంచి కరణి గ్రామానికి రోడ్డు వేయాలని సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం చూడి సచివాలయం వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సచివాలయ అధికారులకు అందజేశారు. సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న మాట్లాడుతూ గతంలో ఈ రోడ్డు నుంచి కోసిగి వరకు కరణి మీదుగా పోయేవారని, మధ్యలో వంక ఉండడంతో ఈ రహదారి బంద్ అయ్యిందన్నారు. దీంతో 10కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లవలసి వస్తుందన్నారు. సమస్యను పరిష్కరించాలని టీడీపీ ప్రభుత్వంకు విన్నపించుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని చూడి నుంచి కరణి వరకు రెండు కిలోమీటర్ల రోడ్డును పూర్తి చేసి వంక బ్రిడ్జి నిర్మించాలని కోరారు. తాత్కాలికంగా కనీసం పైపులు వేసి వాహనాలు తిరిగేలా చేస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో చిన్నమారయ్య, రామాంజినేయులు, బసవ, గోపాల్, తాయప్ప, కరణి, చూడి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి



వివిధ గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కోసిగి: మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోసిగి సీఐ మంజునాథ్ సూచించారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఎస్‌ఐ హనుమంత రెడ్డితో కలిసి మొహర్రం వేడుకలకు అనుమతి కోసం వచ్చిన మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలన్నారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని, ఇందుకు గ్రామ పెద్దలు పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

పత్తిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ

గోనెగండ్ల : పత్తి పంటలో సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయని ఎరువాక కేంద్రం కర్నూలు కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజతమ్మ, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం గోనెగండ్లలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పత్తి పంటలో ప్రతి ఎకరాకు 20 నీలి, 20 పసుపు, 20 తెలుపు జిగురు అట్టలు పెట్టుకోవాలన్నారు. దీని వల్ల రసం పీల్చే పురుగుల ఉధృతి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు పులిరాజు, అరుణ, రైతు సేవా కేంద్రాల సహాయకులు మహేంద్ర, షఫీ తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పద్ధతితో మేలైన దిగుబడులు

పెద్దకడబూరు : అధిక సాంద్రతలో పత్తిని సాగుచేసుకుంటే 20 నుంచి 30శాతం అధిక దిగుబడులు వస్తాయని కృషి విజ్ఞాన్ కేంద్రం(బనవాసి) ప్రోగ్రాం కో ఆర్డీనేటర్ డాక్టర్ రాఘవేంద్ర సూచించారు. మండల పరిధిలోని తారాపురం గ్రామంలో మండల వ్యవసాయాధికారిణి సుచరిత ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అధిక సాంద్రతలో పత్తి సాగు ప్రయోజనాలను వివరించారు.

బాలికకు పాముకాటు

ఆదోని అర్బన్: పట్టణంలోని రాయనగర్‌లో బుధవారం మూడేళ్ల బాలిక ప్రియకు పాముకాటుకు గురికావడంతో అస్వస్థతకు గురయ్యింది. అవుట్ పోస్టు కానిస్టేబుల్ తెలిపిన మేరకు వివరాలు.. రాయనగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న బాలిక ప్రియకు పాముకాటు వేసింది. వెంటనే బంధువులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధణాపురం ఉదయ్, పీడీఎస్‌ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్ డిమాండ్ చేశారు. పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు, యూనిఫాం, బస్సు, ట్యూషన్ ఫీజు, డిపాజిట్ ఫీజు అని రకరకాల ఫీజులను వసూలు చేస్తున్నాయన్నారు.



వైఎస్సార్ సర్కిల్ నుంచి దర్గా రూట్‌లో రెండు అడుగుల మేర నిలిచిపోయిన నీరు

కౌతాళంలో కుండపోత వర్షం

కౌతాళం: మండలంలో బుధవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. వర్షానికి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రధాన విధులన్నీ జలమయమయ్యాయి. వైఎస్సాఆర్ సర్కిల్‌లో రోడ్డుపై నుంచి రెండు అడుగులపైగా నీరు పారాయి. జంగాల కాలనీలో ఇళ్లలోకి నీరు చేరాయి. స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న కాలనీలో అలాగే జెడ్పీ పాఠశాల ఏరియా, మంచాల్‌వీధి, వైఎస్సార్ కాలనీ ఇళ్లల్లో వర్షపు నీరు చేరాయి. ఏకధాటిగా మూడు గంటల పాటు కురిసిన వానతో కౌతాళం గ్రామం తడిసి ముద్దయ్యింది. గత 20రోజుల నుంచి వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతన్నలకు ఈ వర్షం ఎంతగానో ఊరటనిచ్చింది.



మోకాళ్లలోతు నీటిలో తప్పని ప్రయాణం

మోస్తరు వర్షం

నందవరం : బుధవారం మండలంలో నదికైరవాడి, కొత్తకైరవాడి, గంగవరం, పూలచింత, పెద్దకొత్తిలి, నాగలదిన్నె, మిట్టసోమపురం, గురజాల, రాయచోటి, పూలచింత, నందవరం గ్రామాల్లో ఓ మోస్తరుగా వర్షం కురిసింది. సాగు చేసిన పంటలకు ఈ వానలు అనుకూలంగా మారటంతో వ్యవసాయ పనులతో పాటు విత్తుకు రైతన్నలు సిద్ధమయ్యారు.

నేడు ప్రైవేట్ పాఠశాలల బంద్

కౌతాళం: ప్రైవేట్ పాఠశాలలను గురువారం బంద్ చేస్తున్నట్లు కౌతాళం ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం వారు ఎంఆర్‌సీలో క్లర్క్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. పాఠశాలల కరస్పాండెంట్ మాట్లాడుతూ కొంతమంది అధికారులు అనుచిత చర్యలు, రుజువుల్లేని ఆర్‌టీఈ సెక్షన్ 12(1)(సీ) బలవంతపు చేరికలు, పరిహారం లేకుండా అమలు చేయడం, అన్యాయమైన నోటీసులు, పాఠశాల పాలనలో జోక్యం వంటి అంశాలకు వ్యతిరేకంగా శాంతియుత నిరసనగా పాఠశాలలను బంద్ చేస్తున్నట్లు తెలిపారు. బంద్‌కు విద్యార్థుల తల్లి దండ్రులు సహకరించాలని కోరారు.

టీబీ వ్యాధిని తరిమేద్దాం

ఆదోని టౌన్: టీబీ వ్యాధిని దేశం నుంచి తరిమేద్దామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ అన్నారు. బుధవారం పట్టణంలోని శంకర్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని క్రాంతినగర్ కాలనీలో క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వారికి దీర్ఘకాలిక జబ్బులు కేన్సర్, హెచ్‌ఐవీ రోగులకు, షుగర్, బీపీ రోగులకు, పొగతాగే వారికి, ఆల్కహాల్ సేవించే వారికి, పోషకాహార లోపం ఉన్న వారికి, టీబీ వ్యాధి ఉండి మందులు వాడుతున్న వారికి, గతంలో టీబీ వ్యాధి ఉండి మందులు వాడిన వారి కుటుంబ సభ్యులకు గళ్ల పరీక్ష చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాబురాజు, సీతారాములు, మేరి, అరుణ, సుబ్బమ్మబాయి తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం మంజూరు

గోనెగండ్ల : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం, బూట్లు మంజూరైనట్లు ఎంఈఓ-2 నీలకంఠ తెలిపారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం నందు ఆయా పాఠశాలలకు మంజూరైన యూనిఫాంలను హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ రేపటి నుంచి అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేస్తారని తెలిపారు. రెండు రోజుల్లో బూట్లు కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

భక్తురాలి సెల్‌ఫోన్ అప్పగింత



మంత్రాలయంలో భక్తురాలికి సెల్ ఫోన్ అందిస్తున్న ఎస్‌ఐ శివాంజల్

మంత్రాలయం రూరల్ : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం విచ్చేసిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తురాలు లలిత మంగళవారం తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ శివాంజల్ సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్ ఉన్న ప్రదేశాన్ని ట్రేస్ చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భక్తురాలికి ఎస్‌ఐ సెల్‌ఫోన్ అందజేశారు. దీంతో భక్తురాలు లలిత ఎస్‌ఐకి, పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా సావిత్రి

ఆదోని సెంట్రల్: బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా సావిత్రిబాయి ఎంపికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర బీజేపీ అధ్యక్ష ఎన్నిక అనంతరం ఆమెను కౌన్సిల్ సభ్యురాలిగా ఎంపిక చేశారు.

7న ఎమ్మార్పీఎస్ జెండాల ఆవిష్కరణ

ఆదోని రూరల్: ఈనెల 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాల ఆవిష్కరణ ఉంటుందని ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ పులికుంట్ల గోపీ మాదిగ తెలిపారు. బుధవారం మండలంలోని కుపటి, దొడ్డనకేరి గ్రామాల్లో జెండా ఆవిష్కరణ చేసి కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మరిదాసు, ఈరన్న, మునిస్వామి, శాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని కలిసిన పార్టీ జిల్లా అనుబంధ విభాగం నాయకులు



ఎమ్మెల్యేను సన్మానించిన వైఎస్సార్‌సీపీ వికలాంగుల విభాగం కార్యదర్శి తాయన్న, నాయకులు

కోసిగి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి నేతృత్వంలో పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేస్తామని పార్టీ అనుబంధ సంస్థల కమిటీ సభ్యులు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి, కోసిగి మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డిలను శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడతో పాటు ఇటీవల కొత్తగా పార్టీ జిల్లా విభాగంలో పదవులు చేపట్టిన మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి దళవాయి మంగమ్మ, పంచాయతీ రాజ్ విభాగం ఉపాధ్యక్షుడు చూడి బసిరెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కాంట్రాక్ట్ నాగరాజు, వికలాంగుల విభాగం కార్యదర్శి తాయన్న, సాంస్కృతిక విభాగం కార్యవర్గ సభ్యులు కొరివి నాగరాజు, రైతు విభాగం కార్యదర్శి కే ఈ నరసింహులు గౌడ, ఆర్టీఐ విభాగం కార్యదర్శి బిజిగేరి ప్రతాప్, డాక్టర్ల విభాగం ఉపాధ్యక్షులు జేకే ఈరన్న, వలంటీర్ల విభాగం కార్యదర్శిబాపురం అంజనేయులు, బూత్ విభాగం ప్రధాన కార్యదర్శి గొల్ల పరుశురాముడు, ఐటీ విభాగం ప్రధాన కారదర్శి షేక్షావలి తదితరులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యుల సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోని అర్బన్: వైద్య వృత్తి పవిత్రమైనదని, వైద్యుల సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ డాక్టర్ ఎ.మధుసూదన్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని మెట్రో ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. వైద్యుల ఆటపాటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేవుడికి ఇచ్చే గౌరవాన్ని వైద్యులకు ప్రజలు ఇస్తారన్నారు. ఆపద సమయాల్లో ఉన్న రోగులకు ఉచితంగా వైద్యులు వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎంఏ ఆదోని బ్రాంచి ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ శ్రీనివాస్, సెక్రటరీ మధుసూదన్, ట్రెజరర్ డాక్టర్ ఆదిత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగ జిల్లా కమిటీల్లో చోటు

కౌతాళం: మండలంలోని 21 మందికి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా కమిటీల్లో చోటు దక్కింది. కౌతాళానికి చెందిన అబ్దుల్ సమద్‌ను వాణిజ్య విభాగంలో, వడ్డెరాము ట్రేడ్‌యూనియన్, ఉపేంద్రకు స్టూడెంట్ వింగ్, కౌతాళం సర్పంచ్ అవతారానికి ఎస్సీ సెల్, దివ్యాంగుల విభాగంలో షేక్షావలి, మైనార్టీ విభాగంలో ఇస్మాయిల్‌కు పదవులు దక్కాయి. అలాగే చూడి గ్రామానికి చెందిన నాగరాజుకు బూత్ కమిటీలో, కుంబళనూరు క్యాంపుకు చెందిన స్వప్నప్రియాకు మహిళా విభాగంలో, హాల్వికి చెందిన సాధిక్‌కు ఆర్‌టీఐ విభాగంలో ఉప్పరహాల్‌కు చెందిన లింగన్నకు రైతు విభాగంలో, కుంటనహాల్‌కు చెందిన శివరాంకు ఐటీ విభాగంలో ఎరిగేరికి చెందిన మహబుబ్‌బాషాకు డాక్టర్స్ వింగ్‌లో, కుంబనూరు క్యాంపు-1కు చెందిన అనిల్‌కుమార్‌కు గ్రివెన్స్ విభాగంలో వల్లూరుకు చెందిన ఈశప్పగౌడ్‌కు సాంస్కృతికి విభాగంలో కుంటనహాల్‌కు చెందిన బసవన్నగౌడ్‌కు బీసీ సెల్‌లో అవకాశం కల్పించారు. కామవరంకు చెందిన నగేష్‌కు స్టూడెంట్ విభాగంలో నదిచాగికి చెందిన బంగరయ్యకు లిగల్‌సెల్ విభాగంలో, చూడికి చెందిన ఉచ్చప్పకు మేధావుల ఫోరం కమిటీలో, పొదలకుంటకు చెందిన వెంకటేష్‌కు వలంటీర్ల వింగ్‌లో, అగసలదిన్నెకు చెందిన అమరేష్‌కు యూత్ విభాగంలో, కౌతాళంకు చెందిన వైస్ ఎంపీపీ రామలింగస్వామికి పంచాయతీ వింగ్ జిల్లా కమిటీలో పదవి వరించింది. తమకు అవకాశం కల్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి వారు కృతజ్ఞతలు తెలిపారు.

పనుల్లో నాణ్యత తగ్గితే చర్యలు



గాజులదిన్నె ప్రాజెక్టులో ఇన్‌టెక్ వెల్‌ను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ ఏఈ మహేశ్వరి

గోనెగండ్ల : జలజీవన్ మిషన్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తగ్గితే చర్యలు తీసుకుంటామని క్వాలిటీ కంట్రోల్ ఏఈ మహేశ్వరి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలో జలజీవన్ మిషన్ కింద రూ.2.50 కోట్లతో జరుగుతున్న ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం, గాజులదిన్నె ప్రాజెక్టులో రూ.19.50 కోట్లతో చేపట్టిన ట్యాంకులు, ఇన్‌టెక్ వెల్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఏఈ శ్రీనివాసరెడ్డి, కాంట్రాక్టర్ రమణారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణల పంపిణీ



దివ్యాంగుకుల ఉపకరణలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ సువర్ణల సునీయం

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం(ఎంఆర్‌సీ) ఆవరణలో బుధవారం దివ్యాంగులకు ఎంఈఓ సువర్ణల సునీయం చేతుల మీదుగా ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, హియరింగ్ మిషన్స్(చెవిటి మిషన్‌లు), రోలేటర్స్, టీఎల్‌ఎం కిట్స్ తదితర ఉపకరణలను పంపిణి చేశారు. ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు ప్రతిరోజు పాఠశాలకు హాజరు కావాలన్నారు. చదువు పట్ల ఇష్టాన్ని పెంచుకొని ఉన్నత చదువులు అభ్యసించి తమ జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవాలన్నారు. కార్యక్రమంలో మెయిన్ పాఠశాల హెచ్‌ఎం వీరేష్, ఉపాధ్యాయులు నరసింహులు, కేశవ, ఎంఆర్‌సీ సిబ్బంది ఎంఐఎస్ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.